క్లుప్తంగా

టిఫిన్ బాక్స్‌ల పంపిణీ



మోతీనగర్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమోఘమని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సనత్‌నగర్ శాఖ ప్రోగ్రాం కన్వీనర్ కత్తెం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మూసాపేట డివిజన్ బాలాజీ స్వర్ణపురికాలనీలో పారిశుద్ధ్య కార్మికులకు దాత కరణం చిన్న రంగయ్య సహకారంతో టిఫిన్ బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంపాదించిన దానిలో కొంతైనా సమాజానికి వెచ్చించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళి అరవింద్, జేమ్స్ తదిరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో జాతీయ పతాకానికి వందనం చేయాలి

● జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెలంగాణ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో మంగళవారం ఉదయం జాతీయ పతాకానికి వందనం చేయాలని పేర్కొన్నారు. అనంతరం జరిగే సమావేశాల్లో రాష్ట్రం వచ్చిన తర్వాత విద్యా రంగం అభివృద్ధిలో మార్పులు, సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించాలన్నారు. కలెక్టరేట్ ఆవరణలో జరిగే విద్యా దినోత్సవ వేడుకల్లో మంత్రి మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. మన ఊరు – మనబడి కార్యక్రమం కింద పనులు పూర్తయిన పాఠశాలలో ప్రారంభోత్సవాలు, డిజిటల్ క్లాసులు, లైబ్రరీ కార్నర్ల ప్రారంభోత్సవాలు, రాగిజావా పంపిణీ వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

గౌలిదొడ్డి గురుకుల బాలుర కళాశాలలో సంబరాలు

రాయదుర్గం: గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. సోమవారం కళాశాల ఆవరణలో పెద్ద ఎత్తున టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఉన్నతాధికారులు స్వీట్లు పంపిణీ చేశారు. ఇటీవల పెద్ద సంఖ్యలో ఎంబీబీఎస్, ఐఐటీ సీట్ల సాధనలో ఈ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటడం, జాతీయ స్థాయిలో ఎస్సీ కేటగిరిలో 53వ ర్యాంకు రావడంతో వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. కళాశాలను సందర్శించిన ఆర్‌సీఓ డాక్టర్ శారదా వెంకటేష్, ఏసీఓ కిషోర్, ఓఎస్‌డీ రంగారెడ్డి ప్రిన్సిపాల్ వట్టి కొండపాపారావు, తల్లిదండ్రులు, ఎంబీబీఎస్, ఐఐటీ సీట్లు సాధించిన విద్యార్థులతో ముచ్చటించారు. భవిష్యత్తులో మరిన్ని ఎంబీబీఎస్, ఐఐటీ సీట్లు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యాపకులతో చర్చించారు. అనంతరం ఉన్నతాధికారులు విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి భోజనం చేశారు.కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్ వద్ద అత్యాధునిక ఫుట్ ఓవర్ బ్రిడ్జి

గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్ వద్ద పాదచారుల కోసం ఎస్కలేటర్‌తో కూడిన అత్యాధునిక ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి బొటానికల్ గార్డెన్స్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ఔషధ, పండ్ల జాతుల మొక్కలను నాటనున్నట్లు తెలిపారు. మానవాళి మనుగడకు మొక్కే శ్రీరాయ రక్ష అన్నారు. తొమ్మిదేళ్లలో తెలంగాణలో అటవీ విస్తీర్ణం 7.79 శాతం పెరిగిందని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా పేర్కొనడం గర్వకారణమన్నారు. టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తొమ్మిదేళ్లలో గరిష్ఠ స్థాయిలో 273 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. మొక్కలను సంరక్షించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం హరితహారంపై సీఎం చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. బొటానికల్ గార్డెన్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్డు లోపల 1500 ఎకరాల్లో యూకలిప్టస్ చెట్లను తొలగించి చందనం, టేకు మొక్కలు నాటినట్లు వివరించారు.

సీఎం దృష్టికి హోంగార్డుల సమస్యలు

● చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి హామీ

రాయదుర్గం: హోంగార్డుల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి హామీ ఇచ్చారు. సైబరాబాద్ హోంగార్డుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆయనను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. తమ సమస్యలను వివరించి పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో హోంగార్డు వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మన్మథరావు, కుమార్‌రాజా పాల్గొన్నారు.

హరితోత్సవం



బాలాజీనగర్ డివిజన్‌లోని పార్కులో మొక్కలు నాటిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, జెడ్‌సి మమత, తదితరులు

- వాడవాడలా హరితహారం
- మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు
- మొక్కలు నాటి సంరక్షించాలని విజ్ఞప్తులు

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో హరితహారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్లు ఆయా డివిజన్లలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్రాన్ని హరిత హారంగా మార్చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. రాష్ట్రంలో గతంలో ఎటు చూసినా మొక్కలు, చెట్లు లేక, సకాలానికి వర్షాలు లేక అనేక ఇబ్బందులు పడ్డామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం



హైదర్‌నగర్ డివిజన్ కిందికుంట చెరువు వద్ద మొక్కలు నాటిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, కార్పొరేటర్

వచ్చాక ప్రతి సంవత్సరం కేసీఆర్ పిలుపు మేరకు ప్రతి సంవత్సరం వేల మొక్కలు నాటి పచ్చని హరిత వనాన్ని పెంచుకున్నామన్నారు. ఈ హరితహారంలో అధికారులే కాకుండా సామాన్య ప్రజలను సైతం భాగస్వాములను చేసి నేడు రాష్ట్రమంతా పచ్చదనంతో నిండే విధంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించుకున్నామన్నారు. ఈ హరిత హారం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి బాలాజీనగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వద్ద పార్కులను ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్పొరేటర్‌లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వారి ప్రాంతాల్లో మొక్కలు నాటారు.



ఫతేనగర్ డివిజన్‌లో మొక్కలు నాటిన కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తదితరులు



కూకట్‌పల్లి డివిజన్‌లో మొక్కకు నీళ్లు పోస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తదితరులు



నవజీవన్‌నగర్‌లో మొక్కకు నీళ్లు పోస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి తదితరులు



అల్లాపూర్ డివిజన్‌లో మొక్కలు నాటిన కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు



బాలానగర్ మైనార్టీ పాఠశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ డా.పి. కల్పన, విద్యార్థులు



పీజేఆర్‌నగర్ బతుకమ్మ కుంట పార్కు వద్ద మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న నాయకులు

ఆగస్టు కల్లా అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లో రూ.3.50కోట్లతో సీసీ రోడ్లు పునరుద్ధరణ పనులు, పార్కుల అభివృద్ధికి కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం ఈ పనులకు శంకుస్థాపన చేశారు. డివిజన్‌లో పిల్లల నుంచి పెద్దల వరకు అందరికి పార్కులు ఏర్పాటు చేశామన్నారు. ఇండోర్ స్టేడియాలు, షటిల్ కోర్టు, స్విమ్మింగ్ పూల్స్ వంటి అన్ని మౌలిక వసతులతో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఆగస్టు కల్లా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పగడాల శిరీష బాబురావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, జోనల్ కమిషనర్ మమత, డీసీ రవికుమార్, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీ డివిజన్‌లో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

కలుషిత నీటి సరఫరాను అరికట్టండి

మూసాపేట: మూసాపేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కొన్ని రోజులుగా కలుషిత తాగునీరు సరఫరా అవుతోంది. దానిని నివారించడానికి దాదాపు 3 కిలోమీటర్ల మేర కొత్త పైపులైన్ వేయాలని మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు ఆయన వినతి పత్రం అందజేశారు. చాలా సంవత్సరాల క్రితం వేసిన పైపులైను కావడంతో తరచూ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. నూతన పైపులైన్లు వేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, ఖాజా బాయ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న శ్రావణ్

'మనూ'-ఎస్‌సీడీఎస్ మధ్య అవగాహన ఒప్పందం



రాయదుర్గం: ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైనింగ్‌లో నైపుణ్యాభివృద్ధి కోసం అవగాహన ఒప్పందాన్ని చేసుకున్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో హైదరాబాద్‌లోని సమనా కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్(ఎస్‌సీడీఎస్)తో ఉర్దూ విశ్వవిద్యాలయం ఈ అవగాహన ఒప్పందాన్ని చేసుకుంది. సోమవారం ఉర్దూ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సమక్షంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ఎస్‌సీడీఎస్ సంస్థ అధ్యక్షురాలు సమనా హుస్సేని ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎన్ఈపీ–2020కి అనుగుణంగా ఇంటర్ డిసిప్లినరీ, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను అందించేందుకు, మరింతగా నైపుణ్యాలను అందించేందుకు ఒప్పందం చేసుకున్నామ న్నారు. ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్‌లో నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సును విద్యార్థులకు అందించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్‌లో ఏడాది సర్టిఫికెట్ కోర్సును, రెండేళ్ల డిప్లొమో కోర్సు కూడా అందుబాటులో ఉందన్నారు.

నేడు, రేపు జగన్నాథుడి రథయాత్ర

కూకట్‌పల్లి అంతర్జాతీయ ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు

పంజగుట్ట/ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి అంతర్జాతీయ ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20, 21వ తేదీల్లో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ మహా శృంగదాస సోమవారం తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రథయాత్ర వివరాలను వెల్లడించారు. 20వ తేదీన మధ్యాహ్నం 2:34కు జగన్నథ రథయాత్ర హైదర్‌నగర్‌లోని మైసమ్మ గుడి వద్ద ప్రారంభం అవుతుందన్నారు. జగన్నాథ బలభద్ర, సుభద్ర ఉత్సవ మూర్తులను పాదయాత్రలో ఊరేగించనున్నట్లు తెలిపారు. 500 మంది దేశ, విదేశీ భక్తులు నృత్యాలు, కీర్తనలు, భజనలు చేస్తూ బాలానగర్ మెట్రోస్టేషన్ వరకు యాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. రథయాత్ర జరుగుతున్నంత సేపు సుమారు లక్ష మంది భక్తులకు అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేస్తారని తెలిపారు.

◆ 21వ తేదీన బాలంరాయి క్లాసిక్ గార్డెన్స్‌లో సాయంత్రం 5:30కి మెలోడీ కీర్తనలు, భజనలు, పూజలు, మహా హారతి ఉంటుందన్నారు. అక్కడ కూడా సుమారు 90 వేల మంది వరకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ వేడుకలో కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ, వివిధ పార్టీల నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో అగర్వాల్ సమాజ్ రాష్ట్ర చైర్మన్ అంజనీకుమార్ అగర్వాల్, కోచైర్మన్ సతీష్ అగర్వాల్, సురేష్ అగర్వాల్ పాల్గొన్నారు.



రథయాత్ర వివరాలు వెల్లడిస్తున్న మహాశృంగదాస

యాత్ర కొనసాగే ప్రాంతాలు..

హైదర్‌నగర్ ప్రధాన రహదారిలోని మైసమ్మ టెంపుల్ నుంచి జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, బాలానగర్ చౌరస్తాలోని మెట్రో స్టేషన్ వరకు ప్రధాన రహదారి మీదుగా రథయాత్ర కొనసాగుతుంది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

రాయదుర్గం: చదువుతోపాటు సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వారికి గుర్తింపు ఉంటుందని ఐడీఎస్ఈ డైరెక్టర్ చీఫ్ ఇంజినీర్ రబీంద్రనాథ్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో కొత్తగా నియామకమైన మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ అధికారులకు 20 రోజులపాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులు, సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి అధికారి, ఉద్యోగికి అవగాహన అవసరమన్నారు. కొత్తగా నియామకమైన వారికి ప్రత్యేకంగా వీటిపై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ 20 రోజుల పాటు సాగే శిక్షణలో పర్యావరణ పరిరక్షణ, సివిల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంపై తరగతి సెషన్లు, అసైన్‌మెంట్లు, శిక్షణ, గ్రూపు కార్యక్రమాలు, ప్రాతినిధ్యం వహించడం, టెక్నికల్ సైట్ విజిట్ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.



శిక్షణలో పాల్గొన్న అతిథులు, ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు

పశువుల ఆస్పత్రి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి గ్రామంలోని పశువుల ఆస్పత్రి అభివృద్ధి పనులకు సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రూ.20 లక్షల నిధులతో పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు దాటేందుకు సిగ్నల్ ఏర్పాటు చేయండి

బాలానగర్: బాలానగర్ డివిజన్‌లోని శ్రీశ్రీనగర్, రాజీవ్‌గాంధీనగర్, ఇంద్రనగర్, వెంకటేశ్వరనగర్ తదితర ప్రాంతాల ప్రజలు మెయిన్ రోడ్డుకు వెళ్లాలంటే శ్రీశ్రీనగర్ మీద నుంచి వెళ్లాలి. మెయిన్ రోడ్డుపై జీబ్రా క్రాసింగ్, సిగ్నల్ లేకపోవడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు రోడ్డు దాటేందుకు సిగ్నల్, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలని సోమవారం కూకట్‌పల్లి అసిస్టెంట్ కమిషనర్ మోహన్‌రెడ్డికి స్థానికులు వినతి పత్రం అందజేశారు.

బంగారు తెలంగాణ బీజేపీతోనే సాధ్యం

అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి

బాలానగర్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇంటింటికీ కేంద్ర సంక్షేమ పథకాలను పార్టీ నేతలు తీసుకెళ్తున్నారు. గత 20 రోజులుగా చేస్తున్న బీజేపీ నేతలు పాదయాత్ర సోమవారం ఫిరోజ్‌గూడలోకి ప్రవేశించింది. మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా సమష్టిగా పని చేస్తున్నామని అన్నారు. పాదయాత్రలో స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామని తెలిపారు. ఏళ్లు గడిచినా కూకట్‌పల్లి అసెంబ్లీ అభివృద్ధికి నోచుకోలేదని వ్యాఖ్యానించారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు, ఫించన్లు, రేషన్ కార్డుల విషయంలో ప్రజల నుంచి ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదుల అందుతున్నాయని తెలిపారు. బంగారు తెలంగాణ కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు.

అవినీతికి అడ్డాగా బీఆర్ఎస్ పార్టీ..

◆ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. పోలింగ్ బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సరిపడా నిధులు మంజూరు చేసినా వాటన్నింటిని సీఎం కేసీఆర్ దారి మళ్లిస్తున్నారని అన్నారు. ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదంటూ మోదీ ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేయటం సరికాదన్నారు. బీఆర్ఎస్ పార్టీ అవినీతికి అడ్డాగా మారిందన్నారు. కార్యకర్తలు కేసీఆర్ పాలనా వైఫల్యాలను క్షేత్ర స్థాయిలో ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, సూర్యారావు, శ్రీకర్‌రావు, డివిజన్ అధ్యక్షుడు రమేష్, సురేందర్‌రెడ్డి, శివరంజని, ఇంద్రసేనారెడ్డి, కె. రమేష్, కల్పనా, అనిల్, గణేష్, నాయకులు పాల్గొన్నారు.



ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న మాధవరం కాంతారావు, పన్నాల హరీష్‌రెడ్డి, వడ్డేపల్లి రాజేశ్వరరావు

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

కూకట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం కూకట్‌పల్లి జోన్ పరిధిలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేపీహెచ్‌బీ, బాలాజీ నగర్, బాలానగర్, మూసాపేట డివిజన్‌లలో డివిజన్ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. మూసాపేట పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. 10వ తరగతిలో 9.2 మార్కులు సాధించిన విద్యార్థులకు శ్రీరంగం ఫౌండేషన్ తరపున 2,500స్కాలర్‌షిప్‌ను అందజేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ భవిష్యత్‌లో అధికారంలోకి వస్తుందన్నారు. ఈ క్యాక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, టీపీసీసీ సభ్యుడు గొట్టిముక్కల వెంగళరావు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ జైపాల్, బి–బ్లాక్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేంద్ర, విఠల్‌రెడ్డి, తూము వేణు, కృష్ణ రాజ్‌పుత్, తమ్మినేని ప్రవీణ్‌కుమార్, మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న టీపీసీసీ సభ్యుడు సత్యం శ్రీరంగం

నాణ్యతా ప్రమాణాలతో సీసీ రోడ్డు చేపట్టాలి

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జైభారత్‌నగర్‌లో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశామన్నారు. సీసీరోడ్ల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకులు రాజేందర్, సురేష్, కుమారస్వామి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్